# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రపంచ పెట్టుబడుల సదస్సు ద్వారా ఇప్పటివరకు 2 లక్షల 50 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు సాధించామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- విశాఖపట్నంలో గ్లోబల్ డెలివరీ సెంటర్ ఏర్పాటు చేయాలని యాక్సెంచర్ (Accenture) సంస్థను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కోరారు.
- గోదావరి వరద ముంపు నుంచి శాశ్వత నివారణ కోసం పటిష్టమైన చర్యలు చేపట్టామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.
- వైద్య విద్య పరీక్షలలో మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌ను నివారించేందుకు సాంకేతికతను వినియోగిస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.
- ప్రధాన దేవాలయాల్లో రథసప్తమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి తెలిపారు.

=======================

టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ తో దావోస్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సమావేశం అయ్యారు. టీసీఎస్ డెవలప్మెంట్ సెంటర్, అమరావతి క్వాంటం వాలీ, కర్నూలులో తలపెట్టిన సోలార్ పవర్ ప్రాజెక్టుల పురోగతిపై ఈ సందర్భంగా చర్చించారు. మూడు రోజుల దావోస్ పర్యటనలో జరిపిన చర్చల్లో ఇప్పటికే 2 లక్షల 50 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు సాధించామని ముఖ్యమంత్రి తెలిపారు. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, ఏఐ, అగ్రికల్చర్, టూరిజం వంటి రంగాల్లో రాష్ట్రం సాధిస్తున్న ప్రగతిని పరిశ్రామికవేత్తలకు వివరించామని చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

=======================

యాక్సెంచర్ (Accenture) సంస్థ చీఫ్ స్ట్రాటజీ, సర్వీస్ ఆఫీసర్ మనీష్ శర్మతో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ దావోస్ లో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలో గ్లోబల్ డెలివరీ సెంటర్ ఏర్పాటు చేయాలని, అమరావతి క్వాంటం వ్యాలీలో భాగస్వామ్యం వహించాలని కోరారు. యాక్సెంచర్ ఇన్నోవేషన్ ల్యాబ్ ను రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (RTIH)తో అనుసంధానించి ఆవిష్కరణలపై దృష్టి సారించాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నత స్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మనీష్ శర్మ తెలిపారు.

========================

గోదావరి వరద ముంపు నుంచి శాశ్వత నివారణ కోసం 10 కోట్ల 92 లక్షల రూపాయలతో పనులు చేయబడుతున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా ఏనుగువాని లంకలో 'అవుట్ ఫాల్స్ స్లూయిస్' అభివృద్ధి పనులకు మంత్రి ఈరోజు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గోదావరి వరదల సమయంలో ప్రజలు ఇబ్బందులను గమనించామని, వరద ముంపు నష్ట నివారణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టిందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

సాంకేతికతను వినియోగించి వైద్య విద్య పరీక్షలలో కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా చేస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన వర్సిటీలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న 37 ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల సీసీ కెమెరాలు కమాండ్ కంట్రోల్ తో అనుసంధానం చేసినట్లు తెలిపారు. మాల్ ప్రాక్టీస్ వంటివి జరిగితే ఈ సెంటర్ ద్వారా తక్షణం గుర్తించవచ్చని పేర్కొన్నారు. నాణ్యమైన విద్యను తీసుకురావాలన్నదే ప్రభుత్వం లక్ష్యమని.. భవిష్యత్‌లో అన్ని వైద్య విద్యా కళాశాలల్లో ఈ కమాండ్ కంట్రోల్ సేవలు అందుబాటులోకి వస్తామని తెలిపారు. త్వరలో ఆయుష్, నర్సింగ్ కళాశాలలను కూడా కమాండ్ కంట్రోల్ పరిధిలోకి తెస్తామని మంత్రి వెల్లడించారు.

========================

జిల్లాల్లో ఏర్పాటు చేసిన సిసి టీవీ కెమెరాలన్నీ సక్రమంగా పని చేసేలా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుండి ఆయన ఈరోజు జిల్లా కలెక్టర్లతో దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా శాంతి భద్రతలను కాపాడేందుకు నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ట్రాఫిక్ ఉల్లంఘనలను అందుపు చేసేందుకు సిసి టీవీ కెమెరాలను రియల్ టైం గవర్నెన్స్ సెంటర్లతో అనుసంధానించమని పేర్కొన్నారు.  రాష్ట్ర వ్యాప్తంగా లక్ష సిసి టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.

విరామం

========================

రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో జరుగనున్న రథసప్తమి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి తెలిపారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మంత్రి ఈరోజు దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... వైకుంఠ ఏకాదశి, సంక్రాంతి పండుగలను విజయవంతగా నిర్వహించామన్నారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా తిరుమల, అరసవల్లితో పాటు ఇతర ఆలయాల్లో రథసప్తమి నిర్వహిస్తామని తెలిపారు. అరసవల్లిలో జరిగే రథసప్తమికి కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కె. అచ్చెన్నాయుడులు ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పిస్తారని మంత్రి తెలియజేస్తూ....

(వాయిస్ 25 సెకన్లు)

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2015లో Pro-Active Governance and Timely Implementation (ప్రగతి) పేరిట నిర్మాణాత్మకమైన సమీక్షా కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశంలోని కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో జాప్యానికి కారణమయ్యే సమస్యలపై ఈ ప్రగతి వేదిక దృష్టి సారించింది. దీంతో అనేక ప్రాజెక్టులు వేగవంతమయ్యాయి. అందులో భాగంగా 2017లో ప్రారంభమైన హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు గురించి ఇప్పుడు తెలుసుకుందాం...!

హైదరాబాద్ నగర వసులకు ప్రయాణ సౌలభ్యాన్ని మెరుగుపరించేందుకు అధిక సామర్థ్యం గల మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం తలపెట్టింది. హైదరాబాద్ మెట్రో మొదటి దశలో 69.2 కిలోమీటర్ల విస్తీర్ణంలో మూడు కారిడార్లను తొలుత ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ప్రగతి యంత్రాంగం కింద అత్యున్నత స్థాయిలో సమీక్షించారు. సంస్థాగత, ఆర్థిక అడ్డంకులను తొలగించడానికి ప్రధానమంత్రి నిర్ణయాత్మక ఆదేశాలను జారీ చేశారు. ఈ ప్రాజెక్టును పీపీపీ విధానంలో నిర్మించడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఆర్థిక వ్యవహారాల శాఖ, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖలు మెట్రోను సజావుగా, సకాలంలో ప్రారంభించేలా సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ప్రగతి-ఆధారిత జోక్యాలు, ప్రాజెక్ట్ కీలకమైన దశలో స్పష్టతను వేగాన్ని తెచ్చాయి. ఇవి ఆర్థిక సహాయం, నియంత్రణ నిర్ణయాలు మరియు అంతర్-ప్రభుత్వ సమన్వయం నిర్మాణ కార్యకలాపాలను వేగవంతం చేశాయి. ఫలితంగా, హైదరాబాద్ మెట్రో మూడు కారిడార్లలో సమన్వయంతో ముందుకు సాగింది. నగరవాసుల ప్రజారవాణకు మెట్రో ప్రాజెక్ట్ వెన్నెముకగా నిలిచింది.

========================

మొబైల్ ఫోన్ల ద్వారా జరిగే నేరాలను అరికట్టడానికి సంచార్ సాథీ పోర్టల్ ను తీసుకువచ్చినట్లు టెలికమ్యూనికేషన్ విభాగం అడిషనల్ డైరెక్టర్ జనరల్ మోనికొండ నగేష్ రావు తెలిపారు. విజయవాడలో ఆయన ఈరోజు మాట్లాడుతూ... సంచార్ సాథీ పోర్టల్ ద్వారా ఒకరి పేరుపై ఎన్ని సిమ్ కార్డులు ఉన్నాయో తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. సంచార్ సాథీ పోర్టల్, మొబైల్ యాప్ ద్వారా వినియోగదారులు తమ ఫోన్ నంబర్లను రిజిస్టర్ చేసి స్పామ్ కాల్స్, మెసేజ్‌లను నివారించవచ్చని తెలిపారు. దేశంలో సైబర్ మోసాలు పెరుగుతున్న వేళ.. ప్రజల సైబర్ సెక్యూరిటీని మరింత బలోపేతం చేసేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందని తెలిపారు. సైబర్ నేరాలపై 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

========================

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి వారిని ఈరోజు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం పవన్ కళ్యాణ్ కోటప్పకొండ నుంచి కొత్తపాలెంకు 5 కోట్ల రూపాయలతో నిర్మించిన రహదారిని ప్రారంభించారు.

========================
========================